

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జెల అజయ్ కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు శనివారం పరామర్శించారు. అజయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. హరీశ్‌రావు వెంట వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీ ప్రసాద్, కవి, రచయిత దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్‌పర్సన్ ప్రసన్నరామ్మూర్తి, బీఆర్ఎస్ నేతలు గజ్జెల ఆనంద్, గజ్జెల రమేశ్, రావుల విజయ్ కుమార్, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎస్కే అహ్మద్ తదితరులు ఉన్నారు. -ఖైరతాబాద్, జూన్ 15


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 16 జూన్ 2024 | HYDERABAD


• బోనాలపై సమీక్ష




శనివారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఆషాఢ బోనాల జాతర సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.



# గగనతల గస్తీకి సిద్ధమై..

## దుండిగల్ అకాడమీలో పాసింగ్ అవుట్ పరేడ్



దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శనివారం కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఫ్లయింగ్ క్యాడెట్ల కవాతు ప్రదర్శన అత్యద్భుతంగా సాగింది. లోహ విహంగాలు, చాపర్ల విన్యాసాలు ఆద్యంతం అలరించాయి.













## నేడు ఉచితంగా దివ్యాంగులకు

# కృత్రిమ అవయవాల పంపిణీ

## 800 మందికి అందజేత

హిమాయత్‌నగర్, జూన్ 15: ప్రమాదవశాత్తు జీవితం మధ్యలో ఏదైనా అవయవం కోల్పోయి దివ్యాంగులుగా మారిన వారు అవస్థలు పడవద్దనే ఉద్దేశంతో ఆదివారం కింగ్ కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆర్టిఫిషియల్ లింబ్, కాలిఫర్స్, ఫిట్‌మెంట్‌తో పాటు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నారాయణ్ సేవా సంస్థాన్ ట్రస్టీ డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా, కో ఆర్డినేటర్ అల్కా చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 39 ఏండ్లుగా వివిధ రాష్ర్టాల్లో దివ్యాంగులకు ప్రయోజనం కల్పించేందుకు సంస్థ కృషి చేస్తున్నదన్నారు. 2024 ఫిబ్రవరి 4న 1500 మందికి కొలతలు తీసుకోగా, వీరిలో 800 మందికి కృత్రిమ అవయవాలను అందజేస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో సామాజికవేత్త రితేశ్ జగీర్దార్, సంస్థ ప్రతినిధులు ఉత్తమ్ దామ్రాణి, మహేంద్రసింగ్‌రావత్, జస్మిత్ పటేల్, భగవాన్ ప్రసాద్ గౌర్ పాల్గొన్నారు.



ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ లోగోను ఆవిష్కరిస్తున్న సభ్యులు మహేశ్ యాదవ్, మహేందర్ బాబు, ప్రవీణ్ తదితరులు

# రేపు అంకురార్పణ

## ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ఏర్పాటు

### ఈ ఏడాది కొత్త కమిటీ ఆధ్వర్యంలోనే ఉత్సవాలు

### ప్రధాన కార్యదర్శి మహేందర్ బాబు వెల్లడి

ఖైరతాబాద్, జూన్ 15 : ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ఏర్పాటైంది. ఖైరతాబాద్ గణేశ్ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మహేందర్ బాబు, కోశాధికారి మహేశ్ యాదవ్ వివరాలు వెల్లడించారు. 1954లో దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు సింగరి శంకరయ్య స్థానిక బస్తీ వాసులను కలుపుకొని ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీని స్థాపించారని, తొలుత ఒక్క అడుగు విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారన్నారు. ప్రతి ఏడాది ఒక్కో అడుగు పెంచుతూ.. 60 అడుగుల విగ్రహాన్ని సైతం ప్రతిష్ఠించినట్లు చెప్పారు. శంకరయ్య మరణానంతరం ఆయన సోదరులు సింగరి నరసింహ, సింగరి సుదర్శన్ స్థానికుల సహకారంతో ఉత్సవాలను నిర్వహిస్తూ వచ్చారన్నారు.



2017-18 సంవత్సరంలోనే అప్పటి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో నూతన కమిటీ ఏర్పాటు చేయాలని కోరామని, తిరిగి 2021-22 సంవత్సరాల్లో ఈ అంశాన్ని ప్రస్తావనకు తీసుకురాగా, అప్పటి చైర్మన్ సింగరి సుదర్శన్ తాను బతికున్నంత కాలం కుటుంబసభ్యులు, బస్తీ వాసులను కలుపుకొని ఉత్సవాలను నిర్వహించాలని కోరారన్నారు. 2022లో సుదర్శన్ మరణానంతరం బస్తీలోని ముఖ్య నాయకులు ప్రస్తుత ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని కోరామని, ఉత్సవ కమిటీ కార్యనిర్వహణ కార్యదర్శిగా ఉన్న సింగరి రాజ్ కుమార్ ఈ ఒక్కసారిగా తమ కుటుంబసభ్యులు, బస్తీవాసులతో కలిసి నిర్వహిస్తామని చెప్పారన్నారు. తాజాగా సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లి పాత కమిటీపై ఆరా తీయగా, ఆ కమిటీ అస్థిత్వంలో లేదని చెప్పారని, దీంతో ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశామని, చైర్మన్‌గా దివంగత సింగరి సుదర్శన్ కుమారుడు సింగరి రాజ్ కుమార్‌ను, అధ్యక్షులుగా ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి ఈ కొత్త కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది నవరాత్రోత్సవాలను నూతన కమిటీ ద్వారానే చేసేందుకు సింగరి రాజ్‌కుమార్ ఒప్పుకున్నారని, అందులో భాగంగానే సోమవారం కర్రపూజ వేడుకలతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్ కృష్ణా యాదవ్, చందు, ప్రవీణ్ కుమార్, మధుకర్ యాదవ్, రవికాంత్‌రెడ్డి, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరు వరకే డీపీఎంఎస్

## జూలై 1 నుంచి టీఎస్ బీపాస్‌తోనే భవన నిర్మాణ అనుమతులు

సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణ, లేఅవుట్ల అనుమతుల కోసం హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో సింగిల్ విండో విధానాన్ని మాత్రమే అమలు చేయనున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల కోసం 2016 నుంచి డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డీపీఎంఎస్)ను ప్రారంభించగా, దాని స్థానంలో కొత్తగా టీ ఎస్ బీపాస్ విధానాన్ని తీసుకొచ్చారు. ఇప్పటి వరకు రెండు విధానాల్లో అనుమతులకు అవకాశం ఉంది. జూలై 1 నుంచి కేవలం టీఎస్ బీపాస్ ద్వారానే ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే విధానాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధి 7 జిల్లాలు, 70 మండలాలు, 1032 గ్రామాల్లో విస్తరించి ఉన్నది. ఇందులో జీహెచ్ఎంసీతో పాటు 7 కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలు, 697 గ్రామాలు ఉన్నాయి. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ, లే అవుట్ల అనుమతులు డీపీఎంఎస్ ద్వారా ఇస్తుండగా, ఇక నుంచి హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఇచ్చే అనుమతులన్నీ టీఎస్ బీపాస్ ద్వారా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు అనుగుణంగానే వెబ్‌సైట్ మార్పులు చేసి అందుబాటులోకి తీసుకువచ్చామని అధికారులు తెలిపారు.

### పారదర్శకంగా అనుమతుల ప్రక్రియ

భవన నిర్మాణ అనుమతులను ఎంతో పారదర్శకంగా, వేగవంతంగా ఇచ్చేలా టీఎస్ బీపాస్ విధానాన్ని గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించి అమల్లోకి తీసుకొచ్చింది. అనుమతుల్లో జాప్యం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో ప్లాట్ల విస్తీర్ణాన్ని బట్టి టీఎస్ బీపాస్ ద్వారా భవన నిర్మాణాల కోసం అనుమతిస్తున్నారు. ఇప్పటి వరకు డీపీఎంఎస్, డీటీసీపీ పరిధిలో అనుమతులు తీసుకున్న గ్రామాలను, ఇక నుంచి టీఎస్ బీపాస్ పరిధిలోకి తీసుకొచ్చారు. జీపీ లే అవుట్ పర్మిషన్ కోసం టీఎస్ బీపాస్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ లింకు హెచ్ఎండీఏ వెబ్‌సైట్ నుంచే అనుసంధానం చేశామన్నారు . ఇప్పటి వరకు డీపీఎంఎస్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వాటినే పాత విధానంలోనే అనుమతుల ప్రక్రియ ఉంటుంది. పాత దరఖాస్తులు మాత్రమే డీపీఎంఎస్ విధానంలో ప్లానింగ్ విభాగం అధికారులు పరిశీలన చేసి.. అనుమతులు మంజూరు చేస్తారు. భవన నిర్మాణ అనుమతుల విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు ఎంతో సమర్థవంతమైన టీఎస్ బీపాస్ విధానాన్ని హెచ్ఎండీఏ పరిధిలో పూర్తి స్థాయిలో అమలు చేస్తారు. తద్వారా వేగంగా అనుమతుల ప్రక్రియ ఉంటుందని ప్లానింగ్ అధికారులు తెలిపారు.

# విద్యుత్ లైన్లను చక్కదిద్ది..

## క్షేత్రస్థాయిలో డిస్కం స్పెషల్ డ్రైవ్

సిటీబ్యూరో: వర్షాకాలంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించడంపై డిస్కం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జీహెచ్ఎంసీతో పాటు హెచ్ఎండీఏ పరిధిలో విస్తరించి ఉన్న 9 సర్కిళ్లలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉన్నది. ముఖ్యంగా గృహ విద్యుత్‌తో పాటు వ్యాపార వాణిజ్య సంస్థలు, ఐటీ కంపెనీలు, పారిశ్రామిక వాడలన్నీ వీటి పరిధిలోనే ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత వర్షా కాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు క్షేత్ర స్థాయిలో విద్యుత్ లైన్లను పర్యవేక్షిస్తూ నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి ఆయా కాలనీలు, వ్యాపార వాణిజ్య కేంద్రాలు, పరిశ్రమలకు వెళ్లే విద్యుత్ లైన్లలో ఉన్న లోపాలను గుర్తిస్తున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని 11 కేవీ ఫణిగిరి కాలనీ ఫీడర్‌లో దెబ్బతిన్న జంపర్‌లను మార్చారు. అదేవిధంగా బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని 11 కేవీ ఆంధ్రా బ్యాంక్ ఫీడర్‌లో ఏబీ స్విచ్‌ను పునరుద్ధరించి, విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చేశారు. సికింద్రాబాద్ సర్కిల్‌లోని 11 కేవీ రైల్వే రిజర్వేషన్ ఫీడర్‌లో హెచ్‌జీ ఫ్యూజ్‌ను మార్చివేశారు. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలోని 33/11కేవీ లుంబినీ పార్కు సబ్ స్టేషన్ వద్ద దెబ్బతిన్న జంపర్‌లను మార్చి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మరమ్మతులు చేపట్టారు. ప్రతి విద్యుత్ లైను తనిఖీ చేస్తూ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ఉండేలా పరికరాలను మారుస్తున్నామని సర్కిల్ అధికారులు తెలిపారు.



# హలో సార్..

## జలమండలిలో 'డయల్ యువర్ ఎండీ' పునఃప్రారంభం

### గంటన్నర పాటు కార్యక్రమం.. 36 ఫోన్ కాల్స్..

### తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఎండీ ఆదేశం




ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో నిర్వహించిన 'డయల్ యువర్ ఎండీ' ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎండీ సుదర్శన్‌రెడ్డి , ఉన్నతాధికారులు

సిటీబ్యూరో, జూన్ 15 (నమస్తే తెలంగాణ): జలమండలిలో పునః ప్రారంభించిన 'డయల్ యువర్ ఎండీ' ఫోన్ ఇన్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. శనివారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి.. వినియోగదారుల నుంచి నేరుగా ఫోన్ కాల్స్‌ను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎండీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాలను తక్షణమే సంబంధిత డీజీఎంలు, మేనేజర్లు సందర్శించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ అవతల, ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల నుంచి కొత్త కనెక్షన్ల కోసం ఫోన్లు చేశారు. ఈ పరిధిలో ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా రిజర్వాయర్లు పూర్తి కాగా, డిస్ట్రిబ్యూషన్ లైన్ల నిర్మాణం పూర్తయిన వెంటనే కనెక్షన్లు మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని గంటన్నర పాటు నిర్వహించారు. మొత్తం 36 మంది వినియోగదారులు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారని అధికారులు తెలిపారు. ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, నాగోల్, షేక్‌పేట, ఓల్డ్ సిటీ, గౌలిపుర, బాలానగర్, నాంపల్లి ప్రాంతాల నుంచి ఫోన్లు చేసి సమస్యలను వివరించారు. ఎక్కువగా తాగునీటి సరఫరా, కలుషిత నీరు, లో ప్రెషర్, సీవరేజీ ఓవర్ ఫ్లో, పైపులైన్ల నుంచి లీకేజీలు, డ్రైనేజీ వంటి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఈడీ ఎం.సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీ.ఎల్. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.